ట్రాక్ సైక్లింగ్ పోటీలకు గణేష్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పటియాలాలో ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ట్రాక్ సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన డి.గణేష్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గణేష్‌కు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు అభినందనలు తెలిపారు.

గణేష్‌ను అభినందిస్తున్న రాజు, తదితరులు



అసలే పేదరికం... ఆపై అక్షరాస్యతలో అత్యంత వెనుకబాటు... ఆడపిల్లల తల్లిదండ్రుల గుండెలపై ఆరని వరకట్న కుంపట్లు... ఇటువంటి పరిస్థితుల్లో సాధ్యమైనంత వేగంగా పెళ్లిళ్లు చేసి, తమ బాధ్యత నెరవేర్చుకోవాలని తల్లిదండ్రులు భావించడం సర్వసాధారణం. పెళ్లీడుకు రాకముందే (బాలికలకు 18 ఏళ్లు నిండక ముందే) పెళ్లిళ్లు చేస్తే జరిగే అనర్థక పరిణామాలు అర్థం చేసుకోవడం కూడా నిరక్షరాసులు, పేదరికంలో ఉన్నవారికి అంత సులువు కాదు. ఇటువంటి తల్లిదండ్రులను చైతన్యపర్చడంలో జిల్లా యంత్రాంగం విఫలమైంది. బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలు, శిశుమరణాలు ఇటీవల కాలంలో పెరుగుతుండడం ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. సాక్షాత్తూ బాల హక్కుల కమిషన్ చైర్మన్ సొంత జిల్లాలోనే ఇలా ఉండటం పట్ల జనం విస్తుపోతున్నారు.

పెరుగుతున్న బాల్య వివాహాలు

- ఆందోళన కలిగిస్తున్న శిశు మరణాలు
- అరికట్టడంలో విఫలమౌతున్న అధికార యంత్రాంగం
- ఆపై వాస్తవాలు, లెక్కలు దాచిపెట్టే యత్నం
- బాలల హక్కుల కమిషన్ చైర్మన్ ఇలాకాలో దుస్థితి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఆర్థిక గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రంలో అట్టడుగు స్థానం. మిగిలిన జిల్లాలతో పోలిస్తే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల వారీ ఆదాయం, చివరికి తలసరి ఆదాయం కూడా అత్యల్పమే. ఇంటిల్లిపాది ఏదో ఒక పని చేసుకుంటే తప్ప పూట గడవకపోవడం, కాలేజీకి పంపడం కూడా ఆర్థికంగా భారంగా మారిన పరిస్థితుల్లో చాలామంది, ముఖ్యంగా బాలికలను మధ్యలోనే చదువు మాన్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అక్షరాస్యత సరాసరి దశాబ్దాలకు పైబడి 58.89 శాతానికి పరిమితమైంది. చాలా మండలాల్లో ఇంత కన్నా తక్కువగానే ఉంది. ఇటు విద్య, అటు ఆర్థికాభివృద్ధి లేకపోవడంతో ఇప్పటికీ వైద్యారోగ్యంపైనా ముందుచూపు లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలు జిల్లాలో ఎక్కువగానే జరుగుతున్నాయి.

ఆందోళనకరంగా మరణాలు

జిల్లాలో గడిచిన ఏడాది కాలంలో సుమారు సుమారు 200కు పైగా బాల్య వివాహాలు జరిగాయి. గిరిజన, మత్స్యకార ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం 71మంది టీనేజీ ప్రెగ్నెన్సీలు ఉన్నట్టు సాక్షాత్తు ఇటీవల అధికారుల సమీక్షా సమావేశంలో స్పష్టమైంది. గత ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు 16 శిశు మరణాలు, రెండు మాతృ మరణాలు సంభవించినట్టు కలెక్టర్ సమీక్షలోనే స్పష్టమైంది. ఒకానొక సందర్భంలో మాతా శిశుమరణాలపై కలెక్టర్ ఎ.సూర్యకుమారి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు అధికారులు కేవలం బాల్య వివాహాలు మానుకోవాలంటూ సభలు, సమీక్షా సమావేశాలు, ర్యాలీలు, సఖి, సకేళి గ్రూపుల ఏర్పాటుతోనే సరిపెడుతున్నారు.

నెట్‌వర్క్ ఉన్నా..

వాస్తవానికి ఉన్న ఫలంగా బాల్య వివాహాలను అరికట్టేందుకు జిల్లాలో పెద్ద నెట్‌వర్కే ఉంది. ఊరూరా ఐసిడిఎస్ కార్యకర్తలు, మహిళా పోలీస్, వాలంటీర్ వ్యవస్థ, బాల్య వివాహ నిరోధక చట్టం అమలుకు పోలీస్, ఐసిడిఎస్ తదితర శాఖలతో కలిపి ప్రత్యేక టాస్క్ ఉంది. కానీ, ఈ వ్యవస్థను వినియోగించుకోవాలన్న చిత్తశుద్ధి జిల్లా స్థాయి అధికార యంత్రాంగానికి లేకపోవడంతో దాదాపు బాల్య వివాహాలు అన్న మాటనే మర్చిపోయారు. ఇటీవల కాలంలో పెరిగిన శిశుమరణాలపై ఉన్నత స్థాయి అధికారులు ఆరా తీయడంతో జిల్లా కేంద్రంలో కొంత హడావుడి చేస్తున్నప్పటికీ అది చేరాల్సిన చోటుకి చేరడం లేదు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు ఐడిసిఎస్ అధికారులు ఏకంగా వివరాలు చెప్పేందుకు కూడా ముందుకు రావడం లేదు. బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలపై సుమారు నెల రోజుల క్రితం ఐసిడిఎస్ పీడీ శాంతకుమారిని 'ప్రజాశక్తి' వివరాలు కోరినప్పటికీ ఇవ్వలేదు. మరికొన్ని శాఖల అధికారులు తప్పుడు లెక్కలు చూపించేందుకు ప్రయత్నించారు. వాస్తవాలను అంగీకరించే స్వభావం లేని యంత్రాంగం లక్ష్యాలను ఎలా అధిగమించగలదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

లోతైన పరిశీలన, సరైన కార్యాచరణ ఉంటేనే..

బాల్య వివాహాల నివారణ అంటే కేవలం రాత్రికి రాత్రి జరిగే పనికాదు. సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యత వివరించాలి. సమీపంలోని కాలేజీల్లోనూ, ఇంకా అవసరమైన వారికి హాస్టల్ సదుపాయం ప్రభుత్వం తరపున కల్పించాలి. చదువుకున్న వారికి భవిష్యత్తులో ఉన్న అవకాశాలను చూపించగలగాలి. అందుకు తగ్గట్టు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూపించాలి. ఇవేవీ లేకుండా కేవలం బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించడం, అది కూడా పట్టణ కేంద్రాలకే పరిమితం కావడం వల్ల బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలు.. వాటి పర్యావసానంగా శిశుమరణాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఇటీవల కాలంలో బాల్య వివాహాలపై ఎన్నో సమీక్షలు చేసినప్పటికీ లోతైన పరిశీలన లేదని, సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు కూడా అమలు కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

మా ఒక్కరిదే బాధ్యత కాదు

బాల్య వివాహాల బాధ్యత మా ఒక్కరిదే కాదు. వీటిని పర్యవేక్షించడానికి చాలా శాఖలు ఉన్నాయి. అయినా, మా వంతుగా ర్యాలీలు, సమీవేశాలు నిర్వహిస్తున్నాం. బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీల వివరాలు నేను బహిర్గతం చేస్తే కలెక్టర్ ఒప్పుకోరు. ఇప్పటికే జిల్లాలో ఎక్కువగా ఉన్నాయనే కోపంతో ఉన్నతాధికారులు ఉన్నారు.

- బి.శాంతకుమారి, ఐసిడిఎస్ పీడీ

'ఫెర్రో'కు విద్యుత్తు షాక్

- యూనిట్‌కు రూ.2.38 పెంపు
- బెంబేలెత్తిపోతున్న యజమానులు
- మూత దిశగా పరిశ్రమలు
- ఆందోళనలో కార్మికులు

బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్తు షాక్ తగలనుంది. ఏప్రిల్ ఒకటి నుంచి నూతన విద్యుత్తు బిల్లు టారిఫ్ అమలు కానుండడంతో పెరుగుతున్న బిల్లులతో ఫెర్రో పరిశ్రమలలోపాటు ఇతర ఉత్పాదకత పరిశ్రమలు కూడా మూత పడే ప్రమాదం ఉంది. విద్యుత్తు ఆధారంగా నడిచే ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్తు ఛార్జీల పెంపు పెనుభారం అవుతుందని పారిశ్రామిక వేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా పరిశ్రమలు మూతపడే ప్రమాదం పొంచి ఉండటంతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్తు రాయితీని ప్రారంభించారు. అప్పటి నుంచి రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనూ రాయితీని కొనసాగించారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు రాయితీ ఎత్తివేశారు. అప్పట్లో పారిశ్రామిక వేత్తల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో యూనిట్‌కు రూపాయి రాయితీ రీయింబర్స్ చేశారు. 2018 వరకు రాయితీ కొనసాగించిన టిడిపి ప్రభుత్వం అదే ఏడాది ఎత్తేసింది. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు రాయితీ ఇస్తారని పారిశ్రామిక వేత్తలు ఎదురు చూసినప్పటికీ ప్రకటించలేదు. విద్యుత్తు రాయితీ ఇవ్వని వైసిపి ప్రభుత్వం ప్రతి ఏటా విద్యుత్తు ఛార్జీల సవరణ పేరుతో భారం పెంచుతోంది. దీంతో వినియోగదారులందరిపై విద్యుత్తు ఛార్జీల భారం పడుతోంది. ఫెర్రో పరిశ్రమలపై మరింత ఎక్కువ భారం పడడంతో కొన్ని పరిశ్రమలు మూత దిశగా నడుస్తున్నాయి. విద్యుత్తు ఛార్జీల పెంపు పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

యూనిట్‌కు రూ.2.38 వడ్డింపు

ఫెర్రో పరిశ్రమల నుంచి పాత ధరల ప్రకారం యూనిట్ విద్యుత్తుకు రూ.6.02 వసూలు చేసేవారు. ప్రభుత్వం ప్రకటించిన నూతన టారిఫ్ ప్రకారం యూనిట్‌కు రూ.2.38 పెరిగింది. ఫెర్రో పరిశ్రమల నుంచి యూనిట్ విద్యుత్ కు రూ.8.40 వసూలు చేయనున్నట్లు తెలుస్తోంది. విద్యుత్తు ఛార్జీలు పెరిగితే ఫెర్రో పరిశ్రమలు మూత పడే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికే నష్టాలతో నడుస్తున్న ఫెర్రో పరిశ్రమలపై విద్యుత్తు ఛార్జీల భారం తీవ్ర ప్రభావం చూపనుంది. మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఇప్పటికే నష్టాల్లో నడుస్తున్న ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్తు ఛార్జీల పెంపు భారం అధికంగా పడుతుందని పారిశ్రామిక వేత్తలు, ఫెర్రో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూత దిశగా ఫెర్రో పరిశ్రమలు

విద్యుత్తు ఛార్జీల పెంపుతో ఫెర్రో పరిశ్రమలు మూత పడే అవకాశముంది. ఏప్రిల్ ఒకటి నుంచి విద్యుత్తు ఛార్జీల పెంపు అమల్లోకి రానుండడంతో అప్పటి నుంచి పరిశ్రమలు మూత పడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో కొత్తవలస, గరివిడి, చీపురుపల్లి, బొబ్బిలి ప్రాంతాల్లో ఫెర్రో పరిశ్రమలు నడుస్తున్నాయి. ఆయా పరిశ్రమలలో సుమారు 10 వేల మంది కార్మికుల వరకు ఉపాధి పొందుతున్నారు. ఫెర్రో పరిశ్రమలు మూత పడితే కార్మికులు, ఉద్యోగులు రోడ్డున పడతారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో మైతాన్, బెర్రీ, హిరా, సిరి, సహారా, అరోరా, విక్టోరియా, ఎండిఎ ఫెర్రో పరిశ్రమలు నడుస్తున్నాయి. ఆయా పరిశ్రమలపై విద్యుత్తు ఛార్జీల పెంపు ప్రభావం తీవ్రంగా పడుతుంది. ఏప్రిల్ నుంచి ఫెర్రో పరిశ్రమలు మూత పడతాయని చర్చ సాగుతోంది.

విద్యుత్తు ఛార్జీల రాయితీ ఇవ్వాలి

విద్యుత్తు ఆధారంగా నడిచే ఫెర్రో పరిశ్రమలకు ఛార్జీల పెంపు తీవ్ర భారంగా మారుతుంది. జిల్లా వ్యాప్తంగా ఫెర్రో పరిశ్రమల్లో సుమారు 19 వేల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. విద్యుత్తు ఛార్జీలు పెరిగితే ఆయా పరిశ్రమలు మూత పడి కార్మికులు రోడ్డున పడతారు. తక్షణమే విద్యుత్తు ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేకుంటే ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్తు ఛార్జీల రాయితీ ఇవ్వాలి.

- పి.శంకరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

కార్మిక, కర్షకుల హక్కుల కోసం

5న చలో పార్లమెంట్

- మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి
- సదస్సులో ప్రజా సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక, కర్షక హక్కుల కోసం ఏప్రిల్ ఐదో తేదిన ప్రజాసంఘాలు మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమం చేపడుతున్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలుదారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులు కాలరాస్తున్నారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు దేశ వ్యాప్తంగా పెరిగాయన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్‌స్కేల్, స్కీమ్‌వర్కర్లు, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికుల రెగ్యులరైజేషన్, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ చేయాలన్నారు. కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని డిమాండ్‌చేశారు. కేరళ తరహా రైతు రుణమాఫీ చేయాలన్నారు. విద్యుత్తు సవరణ బిల్లు-2022 రద్దు చేయాలని, ఎరువుల సబ్సిడీని పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టానికి బడ్జెట్ రూ.2 లక్షల కోట్లకు పెంచాలని, పట్టణాలకు విస్తరింపచేయాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రజాపంపిణీకి రూ.3 లక్షల కోట్లు కేటాయించి 14 రకాల సరుకులు సబ్సిడీ ధరలతో అందించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై కార్మిక, రైతు, వ్యవసాయ, కౌలురైతు సంఘాలు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 127 కేంద్రాలు.. 25,481 మంది విద్యార్థులు
- 'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ముఖాముఖి

ఏప్రిల్ మూడో తేది నుంచి 18వ తేది వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. 127 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 25,481 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పదో తరగతి పరీక్షలకు చేపడుతున్న ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణపై వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యలేమిటి?.

జిల్లాలో 432 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 25,481 మంది విద్యార్థులు 127 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష వరకు జరుగుతుంది. విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మరో అరగంట అంటే 10 గంటల వరకు విద్యార్థులకు అనుమతిస్తాం. కేంద్రాలను ఇప్పటికే పరిశీలించాం. మౌలిక సదుపాయాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. పరీక్షల నిర్వహణకు 1326 మంది సిబ్బందిని నియమించాం.

చూసిరాతలకు పాల్పడకుండా తీసుకున్న చర్యలేమిటి?.

పరీక్షల్లో చూసిరాతలకు, స్లిప్పులు పెట్టి రాసేందుకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాం. అన్ని కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించాం. వీరితోపాటు తనిఖీ బృందాలు, హై పవర్ కమిటీ పర్యవేక్షణ చేస్తాయి.

పరీక్షల నిర్వహణలో ఏ శాఖలు భాగస్వామ్యం అవుతున్నాయి?.

పరీక్షల నిర్వహణకు పోలీసు, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, విద్యుత్, ఆర్‌టిసి సహకారం తీసుకుంటున్నాం. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా, విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రథమ చికిత్స కోసం అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని శాఖలు సమన్వయం చేసుకునే విధంగా సమావేశం నిర్వహించి జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

పరీక్షల నిర్వహణకు కొత్త మార్పులు ఏమైనా చేశారా?.

ఈ ఏడాది పరీక్షల్లో కొన్ని కొత్త మార్పులు చేశారు. ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నారు. మూడు రోజులకు ఒకసారి పరీక్షా కేంద్రాలు మారుతుంటారు. సైన్స్ పరీక్షలో రెండు ప్రశ్నపత్రాలు, రెండు ఆన్సర్ షీట్లు, రెండు ఒఎంఆర్ షీట్లు ఇస్తారు. ఇప్పటికే పాఠశాలల్లో ఈ విధానంలో పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులు జాగ్రత్తగా రాయాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాల మెరుగుదలకు తీసుకున్న చర్యలు ఏమిటి?.

అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. జనవరి నెలాఖరికి సిలబస్ పూర్తి చేసి, పునశ్చరణ చేయించారు. ఏ సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడి ఉంటే, అందులో అదనపు తరగతులు నిర్వహించి వారిని సిద్ధం చేశారు. సెల్ఫ్ 40 పేరుతో 40 స్కూళ్లలో ప్రత్యేక బోధన చర్యలు తీసుకున్నాం. 100 రోజుల ప్రణాళిక, రోజువారీ పరీక్షలు, గ్రాండ్ టెస్టులు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను సిద్ధం చేశాం. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు వస్తాయి.



ఎప్పటి నుంచి హాల్ టిక్కెట్లు పంపిణీ చేస్తున్నారు?.

హాల్ టిక్కెట్లను ఇప్పటికే పాఠశాలలకు పంపిణీ చేశాం. విద్యార్థులు చదువుకున్న పాఠశాలలో తీసుకోవచ్చు. ఫీజులు కట్టలేదని హాల్ టిక్కెట్లు ఇవ్వని పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. అటువంటి స్కూళ్లు ఉంటే వెంటనే విద్యా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

విద్యుత్తు ఉద్యోగుల సొసైటీ సర్వసభ్య సమావేశం



పూర్వ అధ్యక్షులు వరప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎస్ఇ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీవెంకటేశ్వర ఎపిఇపిడిసిఎల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నగరంలోని దాసన్నపేట రిజిష్టర్ ఆఫీస్ మేడపైన 1104 యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సభలో అధ్యక్షులు పి.రామునాయుడు.. 2021 22 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ నివేదిక, 2022 - 2023 జమ ఖర్చుల నివేదిక ప్రవేశ ప్రవేశపెట్టగా, సభ్యులంతా ఆమోదించారు. 28 సంవత్సరాలుగా సొసైటీకి సేవలు అందించిన పూర్వపు అధ్యక్షులు డిఆర్ఎస్‌వి ప్రసాద్, సొసైటీ పాత పాలకవర్గానికి ఎస్ఇ పి.నాగేశ్వరరావు, డిఇఇ ఎన్.కృష్ణమూర్తి సన్మానించారు. రిటైర్ అయిన 48 మంది ఉద్యోగులను సన్మానించారు. సొసైటీలో ఉన్న సభ్యులు పిల్లలను విద్యలో ప్రోత్సహించడం కోసం 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ప్రతిభ కనబరిచిన 8 మందికి ప్రతిభా పురస్కారాలు అందించారు. అనంతరం ఎస్ఇ పి.నాగేశ్వరరావు, డిఇఇ ఎన్.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సొసైటీని మరింత అభివృద్ధి పథంలో కొత్త పాలకవర్గం నడిపించాలని కోరారు. సొసైటీ నడపడానికి సర్కిల్, డివిజన్ స్థాయిలో అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పి.రామునాయుడు, కార్యదర్శి బి.కూర్మారావు, ఉపాధ్యక్షులు జి.అప్పలనాయుడు, జాయింట్ సెక్రెటరీ ఎ.రవి, డైరెక్టర్లు ఎన్.పైడిరాజు, ఎస్.మురళీ, కె.రాజశేఖర్, ఎన్.రమణ, జి.అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాహుల్ గాంధీని ఎమ్‌పిగా సస్పెండ్ చేయడానికి వ్యతిరేకంగా స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ ఆధ్వర్యాన ఆదివారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి డోల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత్ జోడో యాత్రకు వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేక, పార్లమెంట్‌లో, బయటా రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేక మోడీ ప్రభుత్వం కుతంత్రాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. అదానీ, మోడీ మధ్య సంబంధం, అదానీ అక్రమ ఆస్తులపై ప్రశ్నిస్తుండటంతో బిజెపి ప్రభుత్వం తలలు పట్టుకుంటోందని చెప్పారు. అందుకే కేంద్రం దొడ్డి దారిని ఎంచుకుందని విమర్శించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెహమాన్, టి.సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని శాశ్వత లోక్ అదాలత్ (ప్లాపస్)లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంపాటు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి హెడ్ క్లర్క్, స్టెనో కం టైపిస్ట్, టైపిస్ట్ కం అసిస్టెంట్ ఒక్కో పోస్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అటెండర్ కమ్ ఆఫీస్ సబార్డినేట్ - 4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. దరఖాస్తు చేసే విధానం, అర్హతలు, రిజర్వేషన్, ఎంపిక విధానం తదితర వివరాలకు కార్యాలయంలో గానీ, లేదా https://districts.ecourts.gov.in/vizianagaram వెబ్‌సైట్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

బిందు సేద్యం పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

మండలంలోని అయ్యన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన బిందు సేద్యాన్ని ఎపిఎంఐపి పీడీ పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ ఆదివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన సిహెచ్ అమ్మాజీ తమ కొబ్బరితోటలో ప్రభుత్వ సహకారంతో ఈ డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు. కొబ్బరితోటలో అంతర్ పంటగా కర్బూజా సాగు చేస్తున్నారు. రెండింటికీ ఎంతో ఉపయోగపడే డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని అమర్చుకున్నందుకు రైతును పీడీ అభినందించారు. డ్రిప్ పరికరాలను, వాటి నాణ్యతను, అమర్చిన విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఫినోలాక్స్ ఎంఐ డ్రిప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బిందు సేద్యాన్ని పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

తాగునీటి సమస్యలపై మానిటరింగ్ సెల్

ప్రజాశక్తి-విజయనగరం

వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం తమ కార్యాలయంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్ తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఈ సెల్ అందుబాటులోకి వచ్చిందని ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య 9100120711 నంబరుకు ఫోన్ చేసి, తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

రహదారులను సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారుల పనులను సత్వరమే పూర్తిచేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటరావు అధికారులను కోరారు. ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రహదారులు ఎక్కడ చూసినా గతుకులమయంగా తయారయ్యాయని చెప్పారు. రోడ్లపై ప్రయాణించడానికి ప్రజలు భయపడే పరిస్థితి ఉందని తెలిపారు. తరచూ ప్రమాదాలు సంభవించడమే అందుకు కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి రహదారులను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, కార్యదర్శి ఎస్ఎస్ రెడ్డి, గొలగాన బంగారు రాజు, గువ్వల రవి, దువ్వ వేణు, దువ్వ అప్పారావు పాల్గొన్నారు.

'బొబ్బిలిలో ఎర్త్ డే'

బొబ్బిలి : స్థానిక తాండ్రపాపారాయ బొమ్మ వద్ద బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు ఆదివారం సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి ఆధ్వర్యంలో ఎర్త్ డే కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. అభ్యుదయ హై స్కూల్ విద్యార్థులు పాల్గొని తాండ్రపాపారాయ బొమ్మ నుండి చిన్న బజార్ సెంటర్ వరకు సేవ్ ఎర్త్, సేవ్ లైఫ్, ఎర్త్ డే ఎవ్వెర్ డే ప్ల కార్డ్‌లతో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. పర్యావరణ పరిరక్షకులు ఇ.జానకి మాట్లాడుతూ ఆదివారం రాత్రి 8 నుంచి 9 వరకు అందరూ ఒక గంట విద్యుత్ దీపాలను ఆఫ్ చేయాలని, సేవ్ విద్యుత్ అండ్ సేవ్ ఎర్త్ అంటూ నినాదాలు చేశారు. అభ్యుదయ స్కూల్స్ ప్రిన్సిపాల్ సిహెచ్. శారద మాట్లాడుతూ ఏటా ఎర్త్ డేను నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సభ్యులు ఈ.జానకి, వి.ఎన్ శర్మ, కే.సత్య రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల చెరలో చీపురుబంద

బొబ్బిలి : స్థానిక తారకరామ కాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ చెరువు చీపురు బంద వైసిపి నాయకుల చేతుల్లో ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆరోపించారు. సుమారు మూడు ఎకరాలు అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో కబ్జాకు గురైందని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన చీపురబందను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే మున్సిపల్, రెవెన్యూ అధికారులు వైసిపి నాయకుల ఒత్తిళ్లకు లోనై అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హౌసింగ్ డే ప్రసంగాలకే పరిమితం

వేపాడ : మండలంలోని పలు గ్రామాల్లో ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్న హౌసింగ్ డే కార్యక్రమాలు వల్ల లబ్ధిదారులకు ఎటువంటి ప్రయోజనమూ లేదని చెబుతున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు వచ్చి సూచనలు చేయడమే తప్ప క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు ఎటువంటి సాయం అందడం లేదని వాపోతున్నారు. దీంతో హౌసింగ్ డే కార్యక్రమం ప్రసంగాలకే పరిమితమవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

31 వరకు గడువు పెంపు

వేపాడ : మండలంలోని బక్కు నాయుడుపేట వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించిదని ప్రిన్సిపల్ ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నెల్లిమర్ల: స్థానిక అంబేద్కర్ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సిఇసి గ్రూప్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు గడువు పెంచడం జరిగిందన్నారు.

సుబ్రహ్మణ్యస్వామిపై సూర్య కిరణాలు

శృంగవరపుకోట: పట్టణంలోని దేవి జంక్షన్ వద్ద గల శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంపై శని, ఆదివారాల్లో ఉదయం వేళల్లో సూర్య కిరణాలు పడినట్లు ఆలయ కమిటీ సభ్యులు మద్ది కృష్ణ, షేక్ ఇషాక్ (స్వామి)లు ఆదివారం తెలియజేసారు. కాగా సుబ్రహ్మణ్యస్వామిపై సూర్య కిరణాలు పడ్డాయనే విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు, భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కలశ కుండలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఘనంగా దుర్గమ్మ ఆలయ ప్రతిష్ట

వంగర : మండలంలోని కొప్పరలో దుర్గమ్మ తల్లి ఆలయం ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామానికి చెందిన వడ్డీ శివుడు, వడ్డీ బోడియ్య, వడ్డీ వేణు, గ్రామస్తుల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలంతా కలిసి కలశ కుండలతో గ్రామమంతా ఊరేగింపు చేపట్టారు. సోమవారం ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంతో పాటు, భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

జోనల్ చైర్‌పర్సన్‌ను కలిసిన డిపో మేనేజర్

నెల్లిమర్ల : పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం డిపో మేనేజర్ ఇఎస్‌కె దుర్గ ఆదివారం ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మని కొండవెలగాడలోని ఆమె స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పార్వతీపురం డిపో స్థితిగతులు, ప్రగతి, సమస్యలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ మాట్లాడుతూ ఆర్‌టిసి వృద్ధికి, సమస్య పరిస్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం

వంగర : స్థానిక మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నామని తహశీల్దార్ డి. ఐజాక్ ఆదివారం తెలిపారు. అనంతరం మంత్రి ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరవుతారని ఆయన తెలిపారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు

బొబ్బిలి: శ్రీచైతన్య విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు అలరించారు. పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఆదిరవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు సినీ పాటలకు విద్యార్థులు వేసిన డాన్సులు అలరించాయి. విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. విద్యార్థులలో నైపుణ్యం వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని ప్రిన్సిపాల్ ఎస్.గౌరీశంకర్, యాజమాన్య ప్రతినిధులు కె. రామారావు, డి.పద్మ అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడో రోజు రంజాన్ ఇఫ్తార్ విందు

బొబ్బిలి : బొబ్బిలి మసీదులో రంజాన్ మూడో రోజు ఉపవాసం నెల సందర్భంగా ముస్లిం సోదరులు ఆదివారం ఇఫ్తార్ విందు చేశారు. ఇఫ్తార్ విందులో ముస్లిం మైనారిటీ సంఘం నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

విజయనగరం టౌన్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో దృష్టిలోపమున్న కెజిబివి విద్యార్థులకు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కళ్లద్దాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కె.శ్రావణి , జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ బి. శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి గ్రీవెన్స్‌సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా 'డోల'

విజయనగరం టౌన్ : వైసిపి గ్రీవెన్స్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా డోల మన్మథకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనను జోనల్ ఇన్‌ఛార్జిగా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డికి, మంత్రులు బొత్స సత్యనారాయణ, పి.రాజన్నదొరకు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు మన్మథకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో కెల్ల పంచాయితీ మధుర రెల్లిపేట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కెల్ల గ్రామానికి చెందిన తుపాకుల సాయి (17) మృతి చెందారు. ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లిమర్ల ఐసిడిఎస్ ఎత్తివేత!

● గుర్ల, గరివిడి కలిపి గరివిడి ప్రాజెక్టుగా రూపాంతరం ● నెల్లిమర్లను విజయనగరం అర్బన్‌లో విలీనం ● ఆందోళన చెందుతున్నా కార్యకర్తలు, ఆయాలు ● గుర్ల కేంద్రంగా ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - గుర్ల

నెల్లిమర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌ను విజయనగరం అర్బన్‌లో విలీనం చేయడంతో గుర్ల మండలం ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకూ నెల్లిమర్ల, గుర్ల మండలాలు కలిపి నెల్లిమర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉండేవి. ఇప్పుడు గుర్ల మండలాన్ని, గరివిడి మండలాన్ని కలిపి గరివిడిలో కొత్తగా ఐసిడిఎస్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు అధికారులు అన్ని విధాలా చర్యలు తీసికొంటున్నారు. నెల్లిమర్ల మండల పరిధిలో ఉన్న 105 అంగన్వాడీ కేంద్రాలను విజయనగరం అర్బన్‌లో విలీనం చేయడానికి, గుర్ల మండలంలో ఉన్న 95 అంగన్వాడీ కేంద్రాలను గరివిడి మండలంలో విలీనం చేసి కొత్తగా గరివిడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు.

గుర్ల మండలాన్ని కాదని..

జిల్లాలో భౌగోళికంగా పెద్ద మండలమైన గుర్లలో ప్రాజెక్టును ఏర్పాటు చేయకుండా గరివిడిలో ఏర్పాటు చేయడం పై గుర్ల మండల వసూలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు గరివిడిలో విలీనం చెయడంతో పాటు ప్రాజెక్ట్ ఏర్పాటు పై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చీపురుపల్లిలో ప్రాజెక్టు ఉండగా 5 కిలోమీటర్ల పరిధిలోపలే ఉన్న గరివిడిలో మరో ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం వెనుక ఎవరి ప్రయోజనం ఉందని ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన నెల్లిమర్ల ఐసిడిఎస్ భవనాన్ని నిరుపయోగంగా వదిలి వేసి విజయనగరంలో కలపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిపాలన సౌలభ్యం ఉన్న నెల్లిమర్ల ప్రాజెక్టును ఎందుకు విజయనగరంలో విలీనం చేస్తున్నారో అర్థం కావడం లేదని మరికొందరు అంటున్నారు. చీపురుపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ గుర్ల మండలంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గరివిడిలోనే ఎందుకు.?

జిల్లాలో 42 పంచాయితీలతో అతిపెద్ద మండలంగా ఉన్న గుర్లలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయకుండా గరివిడిలో ఏ ప్రాతిపదికన ఏర్పాటు చేశారని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం అయినా గుర్ల మండలంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఓట్లు కోసం అన్ని రాజకీయా పార్టీలు మా ప్రజాలు, మా ప్రాంతం అంటారని, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ విషయంలో ఏ రాజకీయా పార్టీ మాట్లడకపోవడం విడ్డూరంగా ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏప్రిల్ ఒకటిన ప్రారంభం.?

ఏప్రిల్ 1వ తేదీన గరివిడిలో నూతనంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పనిచేస్తుందని ఐసిడిఎస్ అధికారులు సూచన ప్రాయంగా తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయమై పునరలోచించి గుర్లలో ప్రాజెక్ట్ ఏర్పాటుకు కృషి చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ప్రజలు కోరుతున్నారు.

నెల్లిమర్ల ఐసిడిఎస్ కార్యాలయం

తక్షణమే మంత్రి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - గజపతినగరం

ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధిగాంచి, భక్తికి ప్రతీకగా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద గంజాయి దొరకడం ప్రభుత్వ పరిపాలనకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ దేవాదయ శాఖ మంత్రి వెంటనే రాజీనామ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ నుంచి బియ్యం ఏ విధంగా ఎగుమతి చెందేవో, ఆ విధంగా ఈరోజు గంజాయి అక్రమ రవాణా సాగుతోందన్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నివేదిక ప్రకారం 2021లో దేశంలో 7.5 లక్షల కిలోల గంజాయి పట్టుబడితే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 2లక్షల కేజీలు పై చిలుకు గంజాయి పట్టుబడటం సిగ్గుచేటన్నారు. డ్రగ్స్ దుర్వినియోగం కారణంగా 2018లో 196 ఆత్మహత్యలు జరిగితే, 2021లో 571 ఆత్మహత్యలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ తీరు కారణంగా విద్యార్థులు, యువత యొక్క తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతున్నరన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గరివిడి: తిరుపతి లాంటి పవిత్ర పుణ్య క్షేత్రాన్ని అక్రమాలకు నిలయంగా మార్చారని టిడిపి చీపురుపల్లి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున ఆరోపించారు. ఆదివారం చీపురుపల్లిలో తన ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ టిడిపి హయాంలో తిరుపతి పుణ్యక్షేత్రం గాను, విద్యాలయంగాను పేరు ప్రఖ్యాతులు నిలయంగా ఉంటే, ప్రస్తుత వైసిపి పాలనలో అక్రమార్కులకు నిలయంగా మారిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గంజాయి రవాణా జరగటం దురదృష్టకరమని ఆవేదన చెందారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పైల బలరాం, రౌతు కామునాయుడు, రెడ్డి గోవింద, గవిడి నాగరాజు, అరతి సాహు, కెంగువ ధనుంజయ, పనస మణికంఠ, రేగిడి వాసు, వెంపడాపు లక్ష్మనాయుడు, రౌతు నారాయణ రావు, చల్ల శ్రీరామ్, సబ్బి సోనియా, దిండి రమేష్, బుంగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అచ్చెన్న జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టిన రోజు వేడుకలను మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, బైరెడ్డి లీలావతి, లెంక అప్పలనాయుడు, ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన, గురాన అసిరి నాయుడు, కోటపాటి తిరుపతి రావు, చందక చిన్నంనాయుడు, నల్లం శ్రీను పాల్గొన్నారు.

భోగాపురం: టిడిపి పూర్వ వైభవానికి కృషి చేస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ అన్నారు. టిడిపి మండల కార్యాలయంలో కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మైలపల్లి ఎల్లాజీ, లంక రామ నర్సి, కర్రోతు రాజు, రామసూరి పాల్గొన్నారు.

గరివిడి: అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను చీపురపల్లిలో టిడిపి కార్యాలయంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి కిమిడి నాగార్జున కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, రౌతు కామునాయుడు, రెడ్డి గోవింద, గవిడి నాగరాజు,కెంగువ ధనుంజయ, రౌతు నారాయణ రావు, అరతి సాహు, సబ్బి సోనియా, పనస మణికంఠ, రెడ్డి లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

విజయనగరంకోట: స్థానిక అశోక్ బంగ్లాలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, అచ్చెన్నకు శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీవరప్రసాద్, కార్యదర్శి బంగారుబాబు, కె.నర్సింగరావు, కనకల మురళీమోహన్, కంది మురళీనాయుడు పాల్గొన్నారు.

కాళ్లకూరి రచనలతో సంఘ సంస్కరణ

ప్రజాశక్తి- రాజాం

ప్రఖ్యాత రచయిత కాళ్ళకూరి నారాయణరావు రచించిన నాటకాలతో తెలుగు సమాజంలో సంఘ సంస్కరణ భావాలు ప్రచారంలోకి వచ్చాయని ప్రముఖ పండితుడు, కవి నేతేటి గణేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 98వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గణేశ్వరరావు 'కాళ్ళకూరి వారి కమనీయ దృశ్య కావ్యాలు' అనే అంశంపై ముఖ్య ప్రసంగం చేశారు. చారిత్రక కథలను తన కాలము నాటి సంఘ ప్రయోజనానికి సాంఘిక నాటకాలుగా మలిచి రచించిన గొప్ప రచయిత కాళ్లకూరి అని కొనియాడారు. నారాయణరావు రంగస్థలం నటుడిగా తనకు గల అనుభవంతో చిత్రాభ్యుదయం, వరవిక్రయం, చింతామణి, మధు సేవ, పద్మవ్యూహం అనే ఐదు నాటకాలను రచించారని ఈ ఐదింటిలోన అప్పటి సమాజంలో వేలూనుకొని ఉన్న వరకట్నం, వేశ్యావృత్తి, మద్యపానం అనే దురాచారాలను ప్రతిఘటిస్తూ చక్కటి రచనలు చేశారని చెప్పారు. వారు రచించిన చింతామణి, వరవిక్రయం నాటకాలు ఆనాడు బహుళ ప్రజాదరణ పొంది, ఆయా దుస్సంప్రదాయాల మీద గొప్ప ప్రభావం చూపాయని అన్నారు. అనంతరం వేదిక సభ్యులు గణేశ్వర రావును ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు శాసపు సత్యనారాయణతో పాటు వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, రౌతు గణపతిరావు నాయుడు, పిల్లా తిరుపతిరావు, ఉరిటి గున్నేశ్వరరావు, పెంకి దయానిధినాయుడు, డాక్టర్ ఆల్తి మోహన్‌రావు, రాజాపు శాంతారావు, పొదిలాపు శ్రీనివాసరావు, నేతేటి విజయ శైలజ, దన్నాన రామారావు, సమతం మహేశ్వరరావు, మూడడ్ల శ్రీనివాసరావు, పడాల కవీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతేటి గణేశ్వరరావు

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- రామభద్రపురం

మండలంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వాటికి రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, బొబ్బిలి మండల కార్యదర్శి ఎస్.గోపాలం, జనసేన నాయకులు మహంతి ధనుంజయ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మార్కెట్‌కు ఎదురుగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామభద్రపురం మార్కెట్‌కు ఎదురుగా హైవే పక్కన సర్వే నెంబర్ 98-1లో 56సెంట్లు భూమిని రెవెన్యూ అధికారులు అండతో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు రికార్డులను తారుమారు చేసి ఆక్రమించుకున్నారన్నారు. అదే స్థలంలో ఉన్న ప్రభుత్వ భవనాలను తొలగించి నేలను చదును చేసుకొని దురాక్రమణ చేసిన అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ భూమిని అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఆక్రమణ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో తమ పార్టీ తరుపున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దుర్గా ప్రసాద్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ఎం.గణపతిరావు అధ్యక్షతన జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో జరజాపుపేట సాధన యువజన సంఘానికి చెందిన పోలుబోతు దుర్గా ప్రసాద్ ఎక్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకూ 57 సార్లు రక్తదానం చేసిన ఈయనను మెంబర్‌గా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎన్నికైన 12మంది ఎక్జిక్యూటివ్ మెంబర్స్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. 2007 నుండి సాధన యువజన సంఘం, రెడ్ క్రాస్‌కి అనుబంధంగా రక్తదాన శిబిరాలు, బ్లడ్ లైవ్ డొనేషన్, కోవిడ్‌లో మాస్కులు, కూరగాయలు పంపిణీ, బ్లడ్ గ్రూపింగ్, ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ ముందుకు వెళ్తుందని డిఆర్ఓ గణపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, చేయూత ఫౌండేషన్ ముడిదాపు రాము, మిత్రమా వెల్ఫేర్ ఎం.త్రినాధ్ రావు, సాధన ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, సభ్యులు రొంగలి దుర్గాప్రసాద్, మద్దిల కళ్యాణ్, పరమేష్, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు నోచుకోని లబ్ధిదారులు

వేపాడ : మండలంలోని పాటూరు గ్రామ సచివాలయం పరిధిలో గల ముకుందపురం గ్రామానికి చెందిన 30 మంది పేదలు జగనన్న ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు అదరాబాదరాగా ఇంటి నిర్మాణానికి గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో స్థలాన్ని సేకరించారు. అయితే అక్కడకు ఇంటి నిర్మాణానికి అవసరమైన సామాగ్రి తరలించేందుకు దారి లేక నిర్మాణాలు ముందుకు సాగలేదు. పైగా లేఅవుట్ చుట్టూ బండరాళ్లు, దట్టమైన ముళ్లపదలు, మెట్టకు ఆనుకుని ఉండడం, ఊరికి దూరంగా వెలివేసినట్లు ఉండటంతో లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రాలేదు. ఈ విషయాన్ని లబ్ధిదారులు సర్పంచ్ ద్వారా ఎమ్మెల్యే, జిల్లా పరిషత్తు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కానీ జగనన్న కాలనీలను త్వరలో ప్రారంభిస్తామని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికైనా అధికారకులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇక్కడే స్థలాలు కేటాయించారు..

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

జామి : పంటల మద్దతు ధర చట్టం అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, వ్యవసాయ పంపు సెట్లుకు మీటర్లు పెట్టొద్దంటూ వచ్చే నెల 5తేదీన రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు బుద్ధరాజు రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం జామి మండలంలోని విజినిగిరి, తానవరం, జామి, భీమసింగి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భ ంగా రాంబాబు మాట్లాడుతూ, రైతు వ్యతిరేక చట్టాల పై దేశ వ్యాప్తంగా చేపట్టిన రైతు పోరాటాలకు తలొగ్గిన బిజెపి ప్రభుత్వం, పంటల మద్దతు ధర చట్టం అమలుకు హామీ ఇచ్చిందని, కానీ అమలకు నోచుకోని నేపథ్యంలో దేశ వ్యాప్తం గా రైతుల చేస్తున్న పోరాటంలో భాగంగా చలో ఢిల్లీ కార్యక మం ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పెద్దఎత్తున రైతులు ఢిల్లీకి చేరుకుని పోరాటానికి సంగీబావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఇనపకుర్తి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇనపకుర్తి చిన్న సత్యనారాయణ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విజయవాడకు చెందిన డ్రీమ్ చిల్డ్రన్ యూత్ ఆర్ట్ అకాడమీ 10వ జాతీయస్థాయి చిత్రకళ ప్రదర్శన తుమ్మలాపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాన్ని(సీఈవో) సర్ఫ్ డైరెక్టర్ ఎం. ఇంతియాజ్ ప్రారంభించారు. అవార్డు గ్రహీత సత్యనారాయణ గత 30 సంవత్సరాలుగా చిత్రకళకు చేసిన సేవలను కొనియాడారు. ఆయనకు సాలువా కప్పి పుష్ప మాలలతో సత్కరించి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో 64 కళల ఎడిటర్ కళాసాగర్, అనంత్ డైమండ్స్ అధినేత దేవానంద రెడ్డి, పాల్గొన్నారు. ఆయనకు జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఆనందంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శంకర్రావుతో పాటు తోటి ఉపాధ్యాయులు తెలిపారు. సత్యనారాయణకి అవార్డు రావడంతో ఆయన స్వగ్రామమైన లంకలపల్లి పాలెం గ్రామంలో కుటుంబీకులు బంధువులు స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.



ఇనపకుర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు

సభ ఏర్పాటుకు ఉపాధి కూలీలతో పనులు..?

ప్రజాశక్తి - లక్కవరపుకోట

వైసిపి బహిరంగ సభ నిర్వహించడానికే మండల కేంద్రంలో ఉన్న చెరుకు కాటా ప్రాంగణ ఖాళీ స్థలంలో తుప్పలను తొలగించడానికి ఉపాధి హామీ పథకం కూలీలచే పనులు చేయించారని తెలిస్తోంది. 'కూలీలతో ప్రైవేటు పనులు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురణమైన కథనాన్ని గూర్చి మండలంలో పలువురు చర్చించుకున్నారు. పొదుపు సంఘాలకు మూడో విడత ఆసరా నిధులు విడుదలైన సంగతి విధితమే. ఇందుకు సంబంధించిన సభను వైసిపి చెరుకు కాటా ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని భావించింది. ఇందుకు గాను చెరుకు కాటా ప్రాంగణాన్ని శుభ్రపరచడానికి ఉపాధి హామీ పథకానికి చెందిన కూలీలతో శనివారం పనులు చేయించారు. చెరుకు కాటా ప్రాంగణంలో ఉపాధి హామీ కూలీలు పనిచేయడం ఇంతవరకు తనకు తెలియదంటూ ఎపిఒ రమ్య వివరనివ్వడం హాస్యాస్పదం. అధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కూలీలుచే ఇక్కడ పనులు చేపిస్తున్నానని ఫీల్డ్ అసిస్టెంట్ అరుణకుమారి స్పష్టం చేశారు. అధికారులు చెబుతున్నదానికి క్షేత్ర స్థాయిలో జరిగిన దానికి పొంతనలేకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయంపై జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారో..? వేచి చూడాల్సిందే !

రోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - వేపాడ

మండలం బొద్దాం గ్రామానికి చెందిన జనపరెడ్డి ఈశ్వరరావు(38) కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో వైద్యులు అనారోగ్యం దృష్ట్యా అతని నాలుకను తొలగించారు. బాధను భరించలేక జీవితంపై విరక్తి చెంది పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని ఎస్ కోట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన నాయకులు లోకం నాగ మాధవి ప్రారంభించారు. ఈ పోటీలలో మండలంలోని పలు గ్రామాల నుంచి 18 జట్టులు పాల్గొన్నాయి. ఫైనల్స్‌కు చేరిన కొల్లిపేట, భోగాపురం జట్లు మధ్య హోరాహోరీగా పోటీ జరిగి భోగాపురం జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పల్లా రాంబాబు, పలు గ్రామాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ సెక్రటరీగా చిన్నారి

జిల్లా వాలీబాల్ సెక్రటరీగా ఎంపికైన చిన్నారిని, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నాగన్నను ఆదివారం భోగాపురం యువత, గ్రామ పెద్దలు, వాలీబాల్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. వాలీబాల్ క్రీడతో భోగాపురానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు అందించిన ఉపాధ్యాయులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు పిఇటిలు, యువకులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న లోకం మాధవి

బైండోవర్ కేసులు నమోదు

ప్రజాశక్తి- రామభద్రపురం

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న అనుమానిత వ్యక్తుల పై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. నేర చరిత్ర కలిగి, గతంలో పలు నేరాలపై కేసులు నమోదు కాబడిన వారిని గుర్తించి ఆదివారం వారందర్నీ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. వారిపై రౌడీ షీట్లు ఉన్నట్లు తెలియపరచి మంచి నడవడికతో, సత్ప్రవర్తన కలిగి ఉండాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన రాదని హెచ్చరించారు. వీరందరిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న ఎస్ఐ సురేంద్రనాయుడు